

# ఫిలిప్పీన్స్ నౌకపై చైనా దాడి

**దక్షిణ చైనా సముద్రంలో ఉద్రిక్తత**

న్యూఢిల్లీ: ఫిలిప్పీన్స్, చైనాకు చెందిన రెండు కోస్ట్‌గార్డు నౌకలు ఢీకొనడంతో దక్షిణ చైనా సముద్రంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫిలిప్పీన్స్ నౌక స్వల్పంగా దెబ్బ తింది. బీజింగ్‌కు చెందిన భారీ నౌక తమ సరుకుల నౌకను సెకండ్ థామస్ షోల్ వద్ద అడ్డుకుందని ఫిలిప్పీన్స్ కోస్ట్‌గార్డు ప్రతినిధి ఆరోపించారు. చైనా నౌకలు తమపై జల ఫిరంగులు కూడా ప్రయోగించాయన్నారు. మనీలా నౌకలు తమ జలాల్లోకి ప్రవేశించడంతో వాటిని నియంత్రించే చర్యలు మాత్రమే చేపట్టామని చైనా తన చర్యను సమర్థించుకుంది. ఆస్ట్రేలియాలో బుధవారం ప్రారంభం కానున్న ఆగ్నేయాసియా దేశాల సదస్సులో ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఈ అంశాన్ని ప్రస్తావించవచ్చునని భావిస్తున్నారు.

# సముద్రగర్భ కేబుల్ వ్యవస్థపై హౌతీల దాడి?

**కేబుల్స్ కత్తిరింపు.. కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం**

న్యూఢిల్లీ: ఎర్ర సముద్రంలో ఇప్పటివరకు ఓడలమీద దాడికే పరిమితమైన హౌతీలు ఇప్పుడు ప్రపంచాన్నే వణికించే చర్యను చేపట్టారా? అంటే అవుననే అనుమానాలు కలుగుతున్నాయి. ప్రపంచ కమ్యూనికేషన్ వ్యవస్థలకు ఆయువుపట్టుగా ఉన్న సముద్రగర్భ కేబుల్స్‌పై హౌతీలు గురిపెట్టారన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. సముద్రంలోని నాలుగు ప్రధాన కేబుల్ వ్యవస్థలను వీరు కట్ చేసినట్టు సోమవారం నిర్ధారణ అయ్యింది. వీరి దుశ్చర్య కారణంగా ఆసియా, యూరప్, మధ్యప్రాచ్య దేశాల మధ్య ఇంటర్నెట్, కమ్యూనికేషన్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడే ప్రమాదం ఏర్పడింది. ముఖ్యంగా నాలుగు ప్రధాన టెలికం నెట్‌వర్క్‌లను వీరు కత్తిరించారని తెలిసింది. సముద్రగర్భ కేబుల్ వ్యవస్థను కట్ చేసినట్టు వస్తున్న వార్తలను హౌతీలు ఖండించారు.

# నిలిచిన ఫేస్‌బుక్, ఇన్‌స్టా సేవలు

- **భారత్‌తో సహా పలు దేశాల్లో అంతరాయం**
- **సాంకేతిక సమస్య తలెత్తటం వల్లే ఇబ్బంది**



న్యూఢిల్లీ, మార్చి 5: సోషల్ మీడియా దిగ్గజాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మెటా ప్లాట్‌ఫామ్‌లు మంగళవారం రాత్రి అకస్మాత్తుగా మొండికేశాయి. భారత్‌తో సహా పలుదేశాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నది. సాంకేతిక సమస్య వల్ల వీటి సేవల్లో అంతరాయం ఏర్పడింది. నిరంతరం సోషల్‌మీడియాపై ఆధారపడిన నెటిజన్లు ఈ పరిణామంతో తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. తమ అకౌంట్లు అనూహ్యంగా లాగ్ అవుట్ అయిపోవటం, తిరిగి లాగ్ ఇన్ అవుదామంటే కాకపోవటం జరగటంతో వారంతా అసహనానికి గురైనట్టు ట్రాకింగ్ వెబ్‌సైట్ డౌన్‌డిటెక్టర్ తెలిపింది. ఇదే విషయాన్ని ఇతర ప్లాట్‌ఫామ్స్‌పై వ్యక్తం చేశారు. డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం ఒక్క ఫేస్‌బుక్‌పైనే 3 లక్షల వరకు ఫిర్యాదులు వచ్చాయి. ఇన్‌స్టాగ్రామ్ అంతరాయంపై 20 వేల మంది ఫిర్యాదు చేశారు. ఇక మెటాకు చెందిన అన్ని యాప్‌లలోని వినియోగదారులు తమ పాస్‌వర్డ్‌లను రీసెట్ చేసుకోలేక ఇబ్బందులు పడ్డారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లు ప్రపంచ వ్యాప్తంగా నిలిచిపోవటం ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన అతిపెద్ద ఇంటర్నెట్ అంతరాయంగా పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి.

# భరతమాతను ఆమోదించం

- **జై శ్రీరామ్ అనబోం**
- **భారత్ ఎన్నడూ దేశమే కాదు**
- **డీఎంకే ఎంపీ రాజా వ్యాఖ్యలు**
- **అరెస్ట్ చేయాలని బీజేపీ డిమాండ్**



రాజా

చెన్నై/న్యూఢిల్లీ, మార్చి 5: తమిళనాడుకు చెందిన అధికార డీఎంకే పార్టీ సీనియర్ నేత, ఎంపీ ఏ రాజా తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారతదేశం ఎన్నడూ ఒక దేశం కాదని, అది ఒక ఉపఖండం అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. మరోవైపు జై శ్రీరామ్, భారతమాత అనే బీజేపీ సిద్ధాంతాలను తమిళనాడు ఎన్నటికీ అంగీకరించబోదని పేర్కొన్నారు. రాజా వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. రాజాను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. డీఎంకే నేతలు వరుసగా విద్వేష వ్యాఖ్యలు చేస్తున్నారని, భారత్ గుర్తింపును కించపరచడం, భారత విశ్వాసాలను, హిందూ దేవతలను బహిరంగంగా అవమానించడం వారి అజెండాగా మారిందని మండిపడింది. మరోవైపు రాజా వ్యాఖ్యలతో ఏకీభవించడం లేదని, ఎవరైనా మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాల్సిన అవసరం ఉన్నదని కాంగ్రెస్ పేర్కొన్నది.

మధురైలో మంగళవారం జరిగిన ఓ సమావేశంలో రాజా మాట్లాడిన వీడియో వైరల్‌గా మారింది. భారత్ ఎన్నడూ ఒక దేశంగా లేదని, వివిధ ఆచారాలు, సంస్కృతులతో కూడిన ఒక ఉపఖండమని అన్నారు. 'ఒక దేశం అంటే ఒక భాష, ఒక సంప్రదాయం, ఒక సంస్కృతి ఉంటుంది. అలాంటి లక్షణాలు ఉంటేనే ఏదైనా ఒక దేశం అవుతుంది' అని వ్యాఖ్యానించారు. 'భారత్ ఒక ఉపఖండం. ఎందుకంటే తమిళం అనేది ఒక జాతి, ఒక దేశం. అదేవిధంగా మలయాళం అనేది ఒక భాష, ఒక జాతి, ఒక దేశం. ఒరియా కూడా ఒక జాతి, ఒక భాష, ఒక దేశం. ఇలాంటి జాతీయ జాతులన్నీ కలిసి భారత్‌ను ఏర్పాటు చేశాయి. కాబట్టి భారత్ ఒక దేశం కాదు, ఉపఖండం' అని రాజా పేర్కొన్నారు. తమిళనాడు, కేరళ, ఢిల్లీ, ఒడిశా వంటి రాష్ట్రాలు స్థానిక సంస్కృతులను కలిగి ఉంటాయని అన్నారు. 'మణిపూర్‌లో కుక్క మాంసం తినడం ఒక స్థానిక సాంస్కృతిక అంశం. కశ్మీర్‌లో కూడా ఒక సంస్కృతి ఉంటుంది. ప్రతి ఒక్క సంస్కృతిని గుర్తించాలి. ఒక కమ్యూనిటీ బీఫ్ తింటే, దాన్ని కూడా గుర్తించాలి. అందులో మీ సమస్య ఏంటి? మిమ్మల్ని తినమని అడిగారా? కావున అది వైవిధ్యతలో ఐక్యత. మనలో ఉన్న భిన్నత్వాలను గుర్తించాల్సిన అవసరం ఉన్నది' అని రాజా పేర్కొన్నారు.

**రామాయణం, రాముడు తెలియదు**

రాజా తన ప్రసంగంలో రాముడు, భారతమాత గురించి కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'వారు(బీజేపీ) చెబుతున్నట్టుగా.. మీరు ఇది దేవుడని, ఇది జై శ్రీరామ్ అని, ఇది భారత్‌మాతాకీ జై అని చెబితే, మేము కానీ, తమిళనాడు గానీ భారతమాత, జైశ్రీరామ్‌ను ఆమోదించబోం' అని అన్నారు. 'రాముడికి శత్రువు ఎవరు? సీతతో కలిసి రాముడు అడవులకు వెళ్లాడని మా తమిళ్ టీచర్ చెప్పారు. అతను వేటగాడిని అంగీకరించాడు. సుగ్రీవుడు, విభీషణుడులను సోదరులుగా అంగీకరించాడు. అక్కడ కులం, మతం లేదు. నాకు రామాయణం లేదా రాముడు తెలియదు. నేను దానిని నమ్మను' అని రాజా పేర్కొన్నారు.

**భారతదేశం కూడా ఉండదు!**

లోక్‌సభ ఎన్నికల తర్వాత తమిళనాడులో డీఎంకే ఉండదని ప్రధాని మోదీ చెబుతున్నారని, అలాంటప్పుడు భారతదేశం కూడా ఉండదని రాజా వ్యాఖ్యానించారు. తాను ఇలా ఎందుకు చెబుతున్నానంటే 'వారు(బీజేపీ) రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారు. మీరు మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం ఉండదు. దేశంలో రాజ్యాంగం లేకుంటే భారతదేశం కూడా ఉండదు. భారతదేశం లేకుంటే, తమిళనాడు రాష్ట్రం తమిళనాడుగా ఉండదు. మేం విడిపోతాం. భారతదేశానికి ఇది కావాలా?' అంటూ రాజా మాట్లాడారు.

**డీఎంకే నేతల వరుస విద్వేష వ్యాఖ్యలు**

డీఎంకే నేత రాజా వ్యాఖ్యలపై బీజేపీ నేత, మాజీ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ తీవ్రంగా స్పందించారు. ఇది మావోయిస్టు సిద్ధాంతమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజా వ్యాఖ్యలు సరైనవేనని భావిస్తున్నారా? అని ఆ పార్టీ మిత్రపక్ష కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్, ఖర్గేలను ప్రశ్నించారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని గతంలో డీఎంకే మంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యానించారని, ఇప్పుడు రాజా తన వ్యాఖ్యల ద్వారా దేశ విభజనకు పిలుపునిస్తున్నారని బీజేపీ ఐటీ వింగ్ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజా వ్యాఖ్యలపై కాంగ్రెస్ సహా ఇండియా కూటమి నేతలు ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. రాజాను అరెస్టు చేయాలని తమిళనాడు బీజేపీ అధికార ప్రతినిధి నారాయణ్ సీఎం స్టాలిన్‌ను డిమాండ్ చేశారు. రాజా వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ స్పందిస్తూ రాజా వ్యాఖ్యలను 100 శాతం అంగీకరించబోమని, ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రాముడు అందరి వాడని, కులమతాలు, ప్రాంతాలకు అతీతుడని మీడియాతో మాట్లాడుతూ అన్నారు.


# అరేబియాలో నౌకపై డ్రోన్ దాడి

**సిబ్బందిని కాపాడిన భారత నేవీ**

*న్యూఢిల్లీ: అరేబియా సముద్రంలోని గల్ఫ్ ఆఫ్ ఎడెన్ ప్రాంతంలో ఓ వాణిజ్య నౌకపై డ్రోన్ దాడి జరగగా, భారత్ నేవీ వెంటనే రంగంలోకి దిగి.. మంటల్లో చిక్కుకున్న నౌకను, అందులోని సిబ్బందిని కాపాడింది. నౌకలో మొత్తం 23మంది సిబ్బంది ఉన్నారని, ఇందులో 13 మంది భారతీయులే ఉన్నారని ఇండియన్ నేవీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 'గల్ఫ్ ఆఫ్ ఎడెన్ సముద్ర జలాల్లో ప్రయాణిస్తున్న లైబీరియాకు చెందిన వాణిజ్య నౌక (ఎంఎస్‌సీస్కై-2)పై మార్చి 4న డ్రోన్ దాడి జరిగింది. దీంతో నౌక మంటల్లో చిక్కుకుంది. ఐఎన్ఎస్ కోల్‌కతా తక్షణమే స్పందించింది. ప్రత్యేక అగ్నిమాపక బృందం రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నది' అని నేవీ తెలిపింది.*

# బంకర్లు కడుతున్న బిలియనీర్లు

- **హవాయి దీవుల్లో జుకర్‌బర్గ్ బంకర్**
- **వందల ఎకరాల భూముల్లో ఎస్టేట్లు**
- **వీటిల్లోనే విలాసవంతమైన బంకర్లు**



న్యూయార్క్, మార్చి 5: మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ హవాయి దీవుల్లోని కవాయి ద్వీపంలో రహస్య బంకర్ నిర్మిస్తున్నారట. దీనికి 5,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో, రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ బంకర్ నిర్మాణం విషయాన్ని ఆయన చాలా రహస్యంగా ఉంచుతున్నారు. 2014 నుంచి ఈ దీవిలో పలు దఫాలుగా జుకర్‌బర్గ్ భూమి కొనుగోలు చేసి 1,400 ఎకరాలలో భారీ ఎస్టేట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులోనే ఇప్పుడు బంకర్ నిర్మిస్తున్నారు.

**చాలామంది బిలియనీర్లకు బంకర్లు**

మార్క్ జుకర్‌బర్గ్ మాత్రమే కాదు బిలియనీర్లు చాలామంది ఇప్పుడు దీవుల్లో ఎస్టేట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎస్టేట్లలోనే సకల సౌకర్యాలతో బంకర్లు, రహస్య ప్రదేశాలను నిర్మించుకుంటున్నారట. బిల్ గేట్స్, ఓప్ర విన్‌ఫ్రే, రిచర్డ్ బ్రాన్‌సన్, లారీ పేజ్, జెఫ్ బెజోస్, మార్క్ బెనియాఫ్ వంటి కుబేరులు ఇప్పటికే వేర్వేరు దీవుల్లో పెద్ద ఎత్తున భూమిని కొనుగోలు చేశారు. వీటిల్లోనే బంకర్లు ఉన్నాయనే ప్రచారం ఉన్నది.

**మారుమూల దీవులే సేఫ్**

అసలు ధనవంతులంతా ఎందుకు ఇప్పుడు బంకర్లు కట్టుకుంటున్నారు ? అంత అవసరం ఏమొచ్చింది ? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. ప్రకృతి విపత్తు తలెత్తినా, యుద్ధ పరిస్థితులు వచ్చినా సురక్షితంగా ఉండేందుకు ముందుచూపుతో బంకర్లను నిర్మించుకుంటున్నారనే మాట ప్రధానంగా వినిపిస్తున్నది. స్టేటస్ సింబల్‌గా కూడా బంకర్లు నిర్మిస్తున్నారనే మాట కూడా ఉంది. అయితే, బంకర్ల నిర్మాణానికి బిలియనీర్లు ఎక్కువగా మారుమూల ద్వీపాలనే ఎంచుకుంటున్నారు. ప్రభుత్వాల జోక్యం తక్కువగా ఉండటం, నిరసనలు, అల్లర్లు, యుద్ధం జరిగే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి కాబట్టి వీటిని సురక్షిత ప్రాంతాలుగా బిలియనీర్లు భావిస్తున్నారు.

## ఓపెన్ స్కూల్ విద్యార్థులూ నీట్‌కు అర్హులే

న్యూఢిల్లీ, మార్చి 5: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్)కు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలవరించింది. దేశవ్యాప్తంగా సీబీఎస్ఈ, స్టేట్ బోర్డుల గుర్తింపు పొందిన ఓపెన్ స్కూళ్లలో చదువుకున్న విద్యార్థులు నీట్ పరీక్ష రాసేందుకు అర్హులేనని స్పష్టం చేసింది. ఇంతకాలం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 4(2)(a) నిబంధన ప్రకారం.. ఓపెన్ స్కూళ్లలో చదివిన విద్యార్థులు మెడికల్ ఎంట్రెన్స్ రాయడానికి వీలుండేది కాదు. 2018లో ఢిల్లీ హైకోర్టు సైతం ఈ నిబంధనను తప్పుపట్టింది.

## కాంగ్రెస్‌కు వచ్చేది 37 సీట్లే!

**సొంతంగా 335 స్థానాల్లో బీజేపీ విజయం: సీఎన్ఎక్స్**

న్యూఢిల్లీ, మార్చి 5: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 378 స్థానాల్లో విజయం సాధించి, మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ తాజా సర్వే వెల్లడించింది. బీజేపీ సొంతంగా 335 స్థానాల్లో గెలుస్తుందని పేర్కొన్నది. కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష ఇండియా కూటమి కేవలం 98 స్థానాల్లో మాత్రమే గెలవగలుగుతుందని, అందులోనూ హస్తం పార్టీ అయితే 2019 కంటే మరింత దిగజారి, ఈ సారి 37 స్థానాలకు(2019లో 52) మాత్రమే పరిమితం అవుతుందని ఒపీనియన్ పోల్‌లో అంచనా వేసింది. రెండు కూటముల్లో లేని పార్టీలు 67 సీట్లు గెలుచుకొంటాయని పేర్కొన్నది.

## సివిల్ దుస్తుల్లోనూ ఉండొద్దు

**భారత బలగాలపై ముయిజ్జు**

మాలే, మార్చి 5: మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు మరోసారి తన భారత వ్యతిరేక వైఖరిని చాటుకున్నారు. మంగళవారం ఆయన మాట్లాడు తూ.. మే 10 తర్వాత తమ దేశంలో ఒక్క భారతీయ సైనికుడు ఉండబోడ ని ప్రకటించారు. మిలిటరీ దుస్తుల్లోనే కాదు సివిల్ దుస్తుల్లోనూ మాల్దీవుల్లో భారతీయ మిలిటరీ ఉండదని పేర్కొన్నారు. ప్రస్తుతం మాల్దీవుల్లో భారత్ మూడు ఏవియేషన్ ప్లాట్‌ఫార్మ్‌లను నిర్వహిస్తున్నది.

